ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## భారతరత్న అవార్డులు
### ప్రదానం చేసిన రాష్ట్రపతి
2లో..

సంపుటి: 1 | సంచిక: 355 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 31 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# కరెంటు కోత ఉండొద్దు

## తాగునీటి కొరతను అధిగమించాలి
## వేసవికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలి
## అధికారులకు ముఖ్యమంత్రి అత్యవసర ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఎండాకాలం కావటంతో రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగిందని, అందుకు సరిపడే విద్యుత్తును అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. డిమాండ్ కు సరిపడేంత విద్యుత్తు అందుబాటులో ఉందని, కరెంటు పోయిందనే ఫిర్యాదు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. రోజురోజుకు ఎండలు మండుతుండటం విద్యుత్తు డిమాండ్ పెరుగుతుండటంతో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్తు లభ్యత, తక్షణ అవసరాలపై ముఖ్యమంత్రి ఆదేశాలిచ్చారు. గత ఏడాది కంటే రాష్ట్రంలో ఈ ఏడాది అత్యధికంగా విద్యుత్తును సరఫరా చేయటం కొత్త రికార్డును నమోదు చేసిందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మార్చిలో డిమాండ్ గణనీయంగా పెరిగిందని, పీక్ డిమాండ్ ఉన్నప్పటికీ కోత లేకుండా విద్యుత్తును అందించటంలో డిస్కంలు సమర్థవంతమైన పాత్ర పోషించాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్కని అభినందించారు. గత ఏడాదితో పోలిస్తే డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు సరఫరా గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో సగటున 9712 మెగావాట్ల విద్యుత్తు లోడ్ ఉంటుంది.





గత రెండు వారాలుగా 14000 మెగా వాట్ల నుంచి 15000 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంటోంది. ఏప్రిల్ నెల రెండో వారం వరకు ఇంచుమించుగా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుందని విద్యుత్తు అధికారులు అంచనా వేశారు. వేసవి అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు సరఫరా చేసే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా, పంటలు ఎండిపోకుండా, పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని చెప్పారు. గత ఏడాది (2023) జనవరి నుంచి మార్చి వరకు సగటున రోజుకు 239.19 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయింది. 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల్లో రోజుకు సగటున 251.59 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా జరిగింది. గత ఏడాది మార్చి 14న 297.89 మిలియన్ యూనిట్లు సరఫరా అత్యధిక రికార్డు కాగా.. ఈ ఏడాది 308.54 మిలియన్ యూనిట్లతో కొత్త రికార్డు నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ గత ఏడాదితో పోలిస్తే విద్యుత్తు సరఫరా మెరుగుపడింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏప్రిల్, మే, జూన్ వరకు స్థానికంగా ఉన్న నీటి వనరులను ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బోర్ వెల్స్, బావులన్నింటినీ తాగునీటి అవసరాలకు వాడుకోవాలని, సమీపంలో ఉన్న నీటి వనరులన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సమస్య ఉన్న చోట తక్షణ పరిష్కారాలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని ఆదేశించారు. వేసవి కోసం ప్రత్యేకంగా గ్రామాల వారీగా డ్రింకింగ్ వాటర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని చెప్పారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర స్థాయి నుంచి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలలో తాగునీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ట్యాంకర్లు బుక్ చేస్తే ఆలస్యం లేకుండా 12 గంటల్లోపు అవసరమైన చోటికి చేరేలా చూడాలని, అందుకు సరిపడేన్ని ట్యాంకర్లు సమకూర్చుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



## కాంగ్రెస్‌లో చేరిన
# జీహెచ్‌ఎంసీ మేయర్
### ఆహ్వానించిన మున్షి, సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీలో జోష్ మరింత పెరిగింది. చేరికల పర్వం కొనసాగుతుండటంతో ఆ పార్టీ నేతల్లో ఉత్సాహం నెలకొంది. కాంగ్రెస్ గేట్లు ఎత్తేశాం అని.. రేవంత్ రెడ్డి చెప్పడంతోనే.. ఆ పార్టీలోకి ఒక్కసారిగా చేరికల పర్వం మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్ ప్రాంతంలో చేరికలపై దృష్టిసారించిన సీఎం.. ఆ దిశగా ప్రయత్నాలను మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే GHMC మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షి, టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో శనివారం విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా విజయలక్ష్మికి పార్టీ కండువా కప్పి మున్షి, రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. అయితే, కాంగ్రెస్‌లో విజయలక్ష్మి తండ్రి కే కేశవరావు (కేకే) చేరికపై ఇంకా క్లారిటీ రాలేదు. ఆయన రాజ్యసభ పదవీకాలం రెండేళ్లు ఉండటంతో చేరికపై డైలమాలో ఉన్నట్లు చెబుతున్నారు. శుక్రవారం రేవంత్ రెడ్డిని కలిసిన కేకే.. సోనియా గాంధీ సమక్షంలోనే కాంగ్రెస్‌లో చేరుతానని చెప్పారు. ఇదిలాఉంటే.. కడియం శ్రీహరి, ఇంద్రకరణ్ రెడ్డి.. తదితరులు చేరేందుకు కూడా మూహుర్తం ఖారరైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలతో కడియం శ్రీహరి భేటీ అయ్యారు. హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో సమాలోచనలు జరుపుతున్నారు. పార్టీలోకి రావాలని కాంగ్రెస్ తనను ఆహ్వానించిందని కడియం శ్రీహరి చెప్పారు. భవిష్యత్ కార్యాచరణను కార్యకర్తలు తనకే వదిలేశారని కడియం వివరించారు. సాయంత్రం మీడియా సమావేశంలో అన్ని వివరాలు చెప్తానని కడియం శ్రీహరి తెలిపారు. మరోవైపు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి రాకను స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ సింగాపురం ఇందిర పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. 40 ఏళ్లు కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన వ్యక్తిని ఎలా పార్టీలో చేర్చుకుంటారని ఆమె ప్రశ్నించారు.

### సీఎం రేవంత్‌పై కామెంట్స్..
# కేటీఆర్‌పై క్రిమినల్ కేసు
### కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేసు

హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ పార్టీకి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఇప్పటికే ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగా.. తాజాగా పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న సమయంలో షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే అనేక మంది సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, పలువురు సిట్టింగ్ ఎంపీలు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీ పార్టీలో చేరిపోయారు. అన్ని ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. వరంగల్ అభ్యర్థి కడియం కావ్య పోటీకి విముఖత వ్యక్తం చేస్తూ కేసీఆర్‌కు లెటర్ రాశారు. రాజకీయంగా ఇలా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న తరుణంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయ్యారు. ప్రస్తుతం ఈమె తీహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పోలీసు కేసు నమోదైంది. డబ్బుల విషయమై సీఎం రేవంత్‌పై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆయనపై కాంగ్రెస్ నేత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో.. కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆర్థిక పరమైన



అనుచిత వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రూ.2500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ రావు హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు కేటీఆర్‌పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజాగా.. ఈ ఎఫ్ఐఆర్‌ను హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేటీఆర్‌పై ఐపీసీ 504, 505(2) సెక్షన్ల కింద బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### పలు టీవీ, యూట్యూబ్ ఛానళ్లకు కేటీఆర్
# లీగల్ నోటీసులు

హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం): తమపై అసత్య ప్రచారం చేస్తున్న పలు టీవీ, యూట్యూబ్ ఛానళ్లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. మొత్తం 10 సంస్థలకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లతో పాటు నేరుగా యూట్యూబ్ సంస్థకు కూడా నోటీసులు ఇచ్చారు. కేవలం ఒక కుట్ర, ఎజెండాలో భాగంగా తమపై ఈ ప్రచారం జరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రచారాన్ని చట్టబద్ధంగా ఎదుర్కొంటామని తెలిపారు. తమకు సంబంధం లేని విషయాలలో, తమ పేరును, ఫోటోలను ప్రస్తావిస్తున్న ప్రతి ఒక్క మీడియా సంస్థ, యూట్యూబ్ ఛానళ్లపై న్యాయపరమైన చర్యలతో పాటు పరువు నష్టం కేసులు వేస్తామని హెచ్చరించారు. గతంలోనూ తమపై అసత్య ప్రచారం చేస్తున్న పలు సంస్థలకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. దీంతో ఆయా సంస్థలు తప్పును సరిదిద్దుకొని, అసత్యపూరిత వీడియోలను తీసివేస్తున్నామని ప్రకటించాయి.





2

### ఢిల్లీ లిక్కర్ కేసులో
# మరో సంచలనం
### మరో మంత్రికి ఈడీ సమన్లు

# కడియంపై అనర్హత వేటుకు బీఆర్ఎస్ సిద్ధం



హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్న సీనియర్ నేత కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంపై అనర్హతవేటు వేసేందుకు సిద్ధమైన్లు సమాచారం. కేసీఆర్ సూచన మేరకు శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం ఒకటి అసెంబ్లీకి చేరుకుంది. అయితే.. కడియంపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు పిటిషన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రయత్నించారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ అందుబాటులో లేరని సమాచారం. దీంతో అసెంబ్లీ కార్యదర్శిని కలిసే యత్నం చేయగా.. ఆయన కూడా అందుబాటులో లేరని తెలుస్తోంది. దీంతో డిప్యూటీ సెక్రటరీకి ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆయన స్వీకరించేందుకు నిరాకరించినట్లు ..మిగతా 2లో

# తెలంగాణలో వలసల రాజకీయం

## బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారన్న మంత్రి కోమటిరెడ్డి
## అదే జరిగితే 48 గంటల్లో రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం..
## బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి సంచలన కామెంట్స్





హైదరాబాద్, మార్చి 30 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం వలసల కాలం నడుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల వేళ చాలా మంది నేతలు తమకు కలిసొచ్చే పార్టీలోకి జంప్ అవుతున్నారు. తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పార్టీలు మారుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు సిట్టింగ్ ఎంపీలు, సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీజేపీలో ఇప్పటికే చేరారు. మరికొందరు పార్టీలు మారేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నేతల జంపింగ్‌లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం కీలక కామెంట్స్ చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఖాళీ అవుతాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలు, బీజేపీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. వారు కూడా పార్టీ మారేందుకు సిద్దంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాఫిక్‌గా మారాయి. పార్టీ మారే ఆ 12 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎవరు ? బీజేపీ శాసనసభా పక్షం మొత్తం కాంగ్రెస్ పార్టీలో విలీనమైతే ఆ పార్టీ పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోంది. ఇలాంటి పరిస్థితిలో కోమటిరెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలక కామెంట్స్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలను ముట్టుకుంటే 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డికి టచ్‌లో ఉండటం కాదని.. ఆయన సొంత తమ్ముడు రాజగోపాల్ రెడ్డే ఆయనతో టచ్‌లో లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. భువనగిరి ఎంపీ టికెట్ రాజగోపాల్ రెడ్డి సతీమణికి ఇస్తామని అధిష్ఠానం చెబితే.. వెంకట్ రెడ్డి అడ్డుపడ్డారని అన్నారు.

'నీ తమ్ముడికి నీకే లొల్లైతుంది. అలాంటి వేరే పార్టీ నేతలు నీతోటి టచ్‌లోకి ఎందుకు వస్తరు. బీజేపీకి చెందిన ఓ ఒక్క ఎమ్మెల్యేకు ఇప్పటి వరకు అలాంటి చరిత్ర లేదు. బీజేపీ ఎమ్మెల్యేలను ముట్టుకునే సాహసం చేయవద్దని హెచ్చరిస్తున్నా. మా ఒక్క ఎమ్మెల్యేను నువ్వు ముట్టుకుంటే బిడ్డా.. 48 గంటల్లో నీ ప్రభుత్వం కూలిపోతుంది. మేం హుందాగా ఉన్నాం. ప్రజల తీర్పును గౌరవించి గమ్మున ఉన్నాం.' అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.



# భారతరత్న అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 30 (ప్రభాత ఉదయం): ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారతరత్న అవార్డుల ప్రదానోత్సవం నేడు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ అవార్డులను ప్రదానం చేశారు. మరణానంతరం కొందరికి భారతరత్న ప్రకటించడంతో.. వారి తరఫున కుటుంబ సభ్యులు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఏడాది మొత్తం ఐదుగురికి భారతరత్న ప్రకటించగా.. అందులో శనివారం నలుగురికి రాష్ట్రపతి అవార్డు ఇచ్చారు. బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీకి ఆదివారం స్వయంగా ఇంటికి వెళ్లి అందించనున్నారు. ఢిల్లీని రాష్ట్రపతి భవన్‌లో భారతరత్న అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కేంద్ర ప్రభుత్వం ఏకంగా ఐదుగురికి భారతరత్న ప్రకటించి సంచలనం సృష్టించింది. దీంతో దేశ ప్రథమ మహిళ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ అవార్డుల ప్రదానం చేశారు. మాజీ ప్రధానమంత్రిలు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్ సింగ్.. హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్, బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీలకు ఈసారి భారతరత్న వరించింది. ఇటీవల ప్రకటించిన ఈ పురస్కారాలను శనివారం ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో దేశానికి సేవలందించిన ఐదుగురు ప్రముఖులకు ఈ ఏడాది మూడు విడతల్లో భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో నలుగురికి మరణానంతరం భారతరత్న ప్రకటించగా.. వారి కుటుంబసభ్యులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ పురస్కారాన్ని ప్రదానం చేశారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు భారతరత్న పురస్కారాన్ని స్వీకరించారు. బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకుర్ తరఫున ఆయన కుమారుడు రామ్‌నాథ్ భారతరత్న అందుకున్నారు. మాజీ ప్రధాని చౌదరీ చరణ్ సింగ్ తరఫున ఆయన మనవడు జయంత్ సింగ్ పురస్కారం తీసుకున్నారు. ఎంఎస్ స్వామినాథన్ తరఫున అవార్డును కుమార్తె నిత్యా రావు అవార్డును స్వీకరించారు. ఇక బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం స్వయంగా ఆయన ఇంటికే వెళ్లి భారతరత్న ప్రదానం చేయనున్నారు. ఇక రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన భారతరత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జై శంకర్, కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు హాజరయ్యారు.



# తెలంగాణ రాష్ట్రం కోసం ముందుండి పోరాడను

## పార్లమెంట్ ఎన్నికలలో ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: మాజీమంత్రి ఈటెల రాజేందర్

కూకట్‌పల్లి, మార్చి 30 (ప్రభాత ఉదయం): కూకట్ పల్లి నియోజకవర్గం మూసపేటలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఈటెల రాజేందర్, బిజెపి నేతలు కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, అసెంబ్లీ ప్రబారీ పాపయ్య గౌడ్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, కంటెస్టెడ్ కార్పొరేటర్స్ కృష్ణగౌడ్, కంచి మహేందర్ వివిధ డివిజన్ల అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లడిన బిడ్డను, ఆర్థిక మంత్రిగా నేను చిన్నతనంలో పడిన బాధ ఇప్పటి పిల్లలు అనుభవించవద్దని సన్నబియ్యం పథకం తెచ్చి, కరోనా సమయంలో మంత్రిగా మొట్టమొదటి కరోనా పేషంట్ ను స్వయంగా వెళ్లి కలిసిన మొదటి మంత్రిగా కష్టకాలంలో అండగా ఉన్నారని తెలిపారు. ప్రధాని మోదీ 2 లక్షల 50 వేల ఇళ్లు అర్బన్ హౌసింగ్ కింద తెలంగాణకు మంజూరు చేస్తే కేసిఆర్ కట్టలేకపోయాడని, 1.75 లక్షల ఇళ్లు కట్టామని చెపుతున్నారని, కట్టినవి పేదలకు ఇవ్వకుండా దర్వాజాలు, కిటికీలు పీక్కు పోతున్నారని, కానీ మోదీ గదేశంలో 4 కోట్ల ఇళ్లు కట్టించారని తెలిపారు. అంతేకాకుండా నరేంద్ర మోడీ 12 కోట్ల టాయిలెట్స్ కట్టించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపారని తెలిపారు. 11 వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ను 5వ స్థానంలో ఉంచారని, మళ్ళీ అధికారం ఇస్తే మూడవ స్థానానికి తీసుకు వస్తారని అంటున్నారు. ఒకే దేశం ఒకే చట్టం అమలులోకి తెచ్చిన వ్యక్తి నరేంద్ర మోదీ, రామమందిరం నిర్మాణం చేసి మన సంస్కృతి సాంప్రదాయాలు కాపాడారని తెలిపారు. కేసిఆర్ ఎప్పుడూ మాట్లాడినా అన్నిటిలో 1 చెప్పారు. ఇప్పుడూ కాంగ్రెస్ చెపుతుందని అప్పులో కూడా నంబర్ వన్ చేసి వెళ్లారని ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని మీరంతా రేవంత్ రెడ్డికి ఓట్లు వేశారని, కానీ రేవంత్ ఎన్నడూ మల్కాజ్గిరి కి వచ్చిన దాఖలాలు లేవని అన్నారు. కానీ ఇప్పుడు వచ్చి నాది అంటున్నాడని, నీదే అయితే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు గెలవలేక పోయారని విమర్శించారు. ఈ నియోజకవర్గంలో ఉంటున్న నన్ను ఆదరిస్తే రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ బాగు చేస్తా పిల్లల ఉద్యోగాల కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానని ముందు తలెత్తుకొని మా ఎంపీ అని చెప్పుకొనేలా పనిచేస్తానని ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు.

# ఢిల్లీ లిక్కర్ కేసులో మరో సంచలనం

## మరో మంత్రికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, మార్చి 30 (ప్రభాత ఉదయం): ఢిల్లీ మద్యం పాలసీ కేసు ఆప్‌ను కకావికలం చేస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ అగ్రనేతలు, ఢిల్లీ ప్రభుత్వ పెద్దలు జైలులో ఈడీ కస్టడీలో ఉండగా.. తాజాగా మరో మంత్రికి ఇదే కేసులో కూడా సమన్లు అందాయి. దీంతో ఢిల్లీ లిక్కర్ కేసు.. ఆప్ నేతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. దీంతో సార్వత్రిక ఎన్నికల ముందు ఆప్‌కు గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు సంవత్సరాలుగా ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు ఆమ్ ఆద్మీ పార్టీ మెడకు చుట్టుకుంటోంది. మొదట ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను అరెస్ట్ చేసిన ఈడీ ఆ తర్వాత.. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను జైలుకు పంపించింది. ఇటీవలె ఢిల్లీ సీఎం, ఆప్ నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను సైతం అరెస్ట్ చేసింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ ఢిల్లీ లిక్కర్ కేసు మారుమోగిపోతోంది. అయితే ఈ కేసు ఇంతటితో ఆగకుండా మరింత మంది ఆప్ నేతల చుట్టూ తిరుగుతోంది. తాజాగా మరో ఢిల్లీ మంత్రికి ఈడీ సమన్లు జారీ చేసింది. కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ తాజాగా ఢిల్లీ ప్రభుత్వంలోని మరో మంత్రి కైలాష్ గెహ్లాట్‌ను శనివారం(మార్చ్ 30) ఐదు గంటల పాటు విచారించింది. లిక్కర్ స్కామ్ సొమ్మును గోవా ఎన్నికల్లో ఆప్ పార్టీ ఖర్చు చేసిన విషయం తనకు తెలియదని గెహ్లాట్ ఈడీకి సమాధానమిచ్చినట్లు తెలిసింది. కాగా, రద్దయిన వివాదాస్పద లిక్కర్ పాలసీ 2021-22 రూపొందించడంలో కైలాష్‌గెహ్లాట్ కూడా కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన ప్యానెల్‌లో గెహ్లాట్ సభ్యులుగా ఉన్నారు. లిక్కర్ పాలసీని అధికారికంగా వెల్లడించకముందే సౌత్ గ్రూప్‌నకు పాలసీ డ్రాఫ్ట్ లీకయిందని ఈడీ ఆరోపిస్తోంది. పాలసీ రూపొందిస్తున్న సమయంలో గెహ్లాట్ తన అధికారిక నివాసాన్ని వాడుకోవడానికి ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్‌నాయర్‌కు అనుమతిచ్చారని, ఇంతేగాక గెహ్లాట్ తన మొబైల్ నంబర్లను పదే పదే మార్చారని ఈడీ చెబుతోంది. విజయ్‌నాయర్ తన అధికారిక నివాసంలో ఉన్నాడన్న విషయాన్ని తాను ఒప్పుకుంటున్నట్లు గెహ్లాట్ తాజా విచారణలో ఈడీకి చెప్పినట్లు తెలిసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడం.. ఆ తర్వాత ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల ముందు సంచలంగా మారింది. ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పనలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న ఈడీ.. ఈ నెల 21 వ తేదీన కేజ్రీవాల్ నివాసంలో సోదాలు నిర్వహించి.. ఆయనను అరెస్టు చేసింది. మొదట ఆయనను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచి.. ఈ నెల 28 వరకు కస్టడీలోకి తీసుకుంది. ఆ తర్వాత మరోసారి కోర్టులో ప్రవేశపెట్టడంతో కోర్టు ఏప్రిల్ 1 వ తేదీకి ఈడీ కస్టడీని పొడగించింది. ఈ కేసులో ఈనెల 28 వ తేదీన జరిగిన కోర్టు విచారణ సందర్భంగా జడ్జి అనుమతితో కేజ్రీవాల్ స్వయంగా తన తరఫున తానే వాదనలు వినిపించుకున్నారు. ఈ క్రమంలోనే ఈడీపై తీవ్ర ఆరోపణలు చేసిన కేజ్రీవాల్.. కేవలం నలుగురు ఇచ్చిన వాంగ్మూలాలతోనే తనను అరెస్టు చేశారని మండిపడ్డారు. ఇక ఈడీ కస్టడీ నుంచే ఢిల్లీ పాలనావ్యవహారాలను కేజ్రీవాల్ చూస్తున్నారు.



# బీజేపీ మేనిఫెస్టో కమిటీ

## లిస్ట్ రిలీజ్ చేసిన జేపీ నడ్డా

న్యూఢిల్లీ, మార్చి 30 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దేశంలోని అన్ని పార్టీలు కృషి చేస్తున్నాయి. ఈ తరుణంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికల మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన జాబితా నెట్టింట్లో వైరల్ అవుతోంది. బీజేపీ మూడవసారి అధికారంలోకి రావాలని ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టో ప్యానెల్ కన్వీనర్‌గా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను నియమించగా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. 27 మంది సభ్యుల ఎన్నికల మేనిఫెస్టో కమిటీలో కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్, స్మృతి ఇరానీ, రాజీవ్ చంద్రశేఖర్, కిరణ్ రిజిజు, అర్జున్ ముండా తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఈ జాబితాలో అర్జున్ రామ్ మేఘ్వాల్, భూపేందర్ యాదవ్, విష్ణు దేవ్ సాయి, భూపేందర్ పటేల్, శివరాజ్ సింగ్ చౌహాన్, మోహన్ యాదవ్, వసుంధర రాజే, రవిశంకర్ ప్రసాద్‌లు ఎన్నికల మేనిఫెస్టో కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వీరితో పాటు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ కూడా జాబితాలో స్థానం సంపాదించుకున్నారు.

# కడియంపై అనర్హత వేటుకు బీఆర్ఎస్ సిద్ధం

మొదటి పేజీ తరువాయి...



తెలుస్తోంది. మరోవైపు కడియంపైన కాకుండా.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు ఫిర్యాదు చేసేందుకు ఈ బృందం వెళ్లినట్లు ప్రచారం నడుస్తోంది. దీంతో ఇద్దరిపైన లేకుంటే ఇద్దరిలో ఒకరిపైనే బీఆర్ఎస్ ఫిర్యాదుకు సిద్ధమైందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఎవరి మీద అయినా.. ఆలస్యం చేయకుండా ఆయనపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ కోరనుందని సమాచారం. ఒకవేళ అనర్హత పిటిషన్‌ను స్పీకర్ స్వీకరిస్తే గనుక.. తదనంతర పరిణామాలు ఎలా ఉండబోతున్నాయా? అనే ఆసక్తి నెలకొంది. మరోపక్క శనివారం ఉదయం అనుచర గణంతో సమావేశమైన కడియం, ఆయన కూతురు కావ్యలు పార్టీ మారబోతున్నట్లు నిర్ణయం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, పార్టీకి ప్రజలు దూరమవుతున్నారని, కారణాలు ఏవైనా బీఆర్ఎస్ ను ఇంకా ప్రజలు ఆదరించే పరిస్థితి లేదని కడియం శ్రీహరి చెప్పుకొచ్చారు. అందుకే తాము తప్పనిసరి స్థితిలో ఈ నిర్ణయం తీసుకుంటున్నామని అన్నారు. కావ్య తాను వరంగల్ ఎంపీగా పోటీ చేయబోతున్నానని.. తనను గెలిపించాలంటూ వ్యాఖ్యానించారు.




# అప్పటి వరకూ ఎగ్జిట్ పోల్స్ వద్దు

## ఈసీ ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 30 (ప్రభాత ఉదయం): ఎగ్జిట్ పోల్స్‌కు సంబంధించిన కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఏప్రిల్ 19 ఉదయం 7.00 నుంచి జూన్ 1 సాయంత్రం 6.30 గంటల వరకు లోక్‌సభతోపాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ పూర్తయ్యేదాకా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం, ప్రచురించడం, ప్రచారం చేయడంపై నిషేధం విధిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం.. ఒపీనియన్ పోల్ లేదా మరేదైనా పోల్ సర్వే ఫలితాలను ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రదర్శించడం నిషేధమని నోటిఫికేషన్‌లో ఈసీఐ స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు 12 రాష్ట్రాల్లోని 25 అసెంబ్లీ నియోజకవర్గాలకు విడివిడిగా ఉప ఎన్నికలు కూడా జరుగుతున్నాయి.

# ఇండియన్ నేవీ మరో ఆపరేషన్

## సముద్ర దొంగలనుంచి 23 మంది పాక్ వాసులను కాపాడిన సిబ్బంది



న్యూఢిల్లీ, మార్చి 30 (ప్రభాత ఉదయం): ఇటీవలి కాలంలో సముద్రంలో సముద్రపు దొంగల ఆగడాలు ఎక్కువైపోతున్నాయి. దీంతో సముద్రంలో వెళ్లే నౌకలను అడ్డగించి అందులోని సిబ్బందిని బంధించి సరుకు ఎత్తుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా సముద్రపు దొంగలకు చెక్ పెడుతూ ఇండియన్ నేవీ ఎన్నో ఆపరేషన్లు నిర్వహిస్తోంది. తాజాగా మరో ఆపరేషన్ చేపట్టి.. 23 మంది పాక్ వాసులను భారత నౌకాదళ సిబ్బంది సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. స్పెషల్ ఆపరేషన్ చేపట్టి ఆ బోట్‌ను రక్షించింది. భారత జలాల్లో కీలక మిషన్లు చేపట్టే ఇండియన్ నేవీ సిబ్బంది.. ఇతర దేశాల నౌకలు ప్రమాదంలో ఉన్నపుడు, వాటికి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రంగంలోకి దిగి రక్షిస్తూ ఉంటాయి. ఈ క్రమంలోనే ఇటీవల సముద్ర దొంగల ఆటలు కట్టిస్తున్న ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. సముద్రంలో చేపల బోట్లను సముద్ర దొంగలు హైజాక్ చేయగా.. రంగంలోకి దిగి స్పెషల్ ఆపరేషన్ చేపట్టి దాన్ని విడిపించింది. అంతేకాకుండా ఆ హైజాక్ అయిన బోట్‌లో ఉన్న 23 మంది పాక్ సిబ్బందిని రక్షించింది. దీంతో ఇండియన్ నేవీపై మరోసారి ప్రశంసల జల్లు కురుస్తోంది. వాయువ్య హిందూ మహా సముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ చేపల బోటును సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. గల్ఫ్ ఏడెన్‌కు సమీపంలో ఉన్న సోకోట్రా ద్వీప సమూహానికి 90 నాటికల్ మైళ్ల దూరంలో గురువారం ఇరాన్‌కు చెందిన చేపల బోటు హైజాక్‌కు గురైంది. ఆ బోటును 9 మంది సముద్ర పైరేట్స్ తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఇండియన్ నేవీకి సమాచారం అందింది. ఈ క్రమంలోనే ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు భారత నేవీ శుక్రవారం రాత్రి ప్రకటించింది. అనంతరం ఆ ఇరాన్ చేపల బోటును, అందులో ఉన్న జాలర్లను రక్షించేందుకు.. ముందుగా రంగంలోకి దిగిన ఐఎన్ఎస్ సుమేధా యుద్ధ నౌక సముద్రపు పైరెట్ల అదుపులో ఉన్న ఏఐ కంబార్ బోటును అడ్డగించింది. ఆ తర్వాత ఐఎన్ఎస్ సుమేధాకు ఐఎన్ఎస్ త్రిశూల్ యుద్ధ నౌక కూడా దానికి తోడైంది. దాదాపు 12 గంటల పాటు సాగిన ప్రత్యేక ఆపరేషన్ తర్వాత ఆ బోటులో ఉన్న సముద్ర పైరెట్లు ఇండియన్ నేవీ సిబ్బందికి లొంగిపోయారు. దీంతో ఈ బోటులో ఉన్న సిబ్బందిని రక్షించినట్లు ఇండియన్ నేవీ అధికారులు వెల్లడించారు. ఆ బోటులో ఉన్నవారు 23 మంది పాకిస్తాన్‌కు చెందిన సిబ్బందిని సురక్షితంగా బయటికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సముద్రాల్లో యాంటీ పైరసీలో భాగంగా ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు వివరించారు.

# రాజేంద్రనగర్‌లో రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్ ను ప్రారంభిస్తున్న పాస్టర్లు



రన్ ఫర్ జీసస్ లో పాల్గొన్న క్రైస్తవులు



చిన్నారులు సైతం....



పరుగెడుతూ....



రన్ ఫర్ జీసస్ లో విశ్వాసులు, పాస్టర్లు



ద్విచక్ర వాహనంపై...



పోలీసుల బందోబస్తు...



యేసయ్య కోసం మేము సైతం అంటూ...

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. బుద్వేల్ యునైటెడ్ చర్చెస్ ఆధ్వర్యంలో ఆరాధన టీవీ ఛానల్ సహకారంతో చందు, ప్రశాంత్ , కోరని వర ప్రసాద్ మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం ఏడు గంటలకు బుద్వేల్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ కె. నతానియెల్, రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె. సుందర్ పాల్ లు ప్రార్థనలు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు . బుద్వేల్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా, ఎన్ పి పి టి ఐ, పీడీపీ చౌరస్తా , ఉప్పర్ పల్లి, హైదర్ గూడ , అత్తాపూర్ ల మీదుగా ఈ ర్యాలీ అబిడ్స్ లోని సెయింట్ జార్జ్ డిగ్రీ కళాశాల వరకు కొనసాగింది . చిన్న, పెద్ద అనే తేడా లేకుండా క్రైస్తవులు పెద్ద సంఖ్యలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్నారు . గుడ్ ఫ్రైడే రోజు ఏసుప్రభు శిలువలో మరణించి మూడవ దినమున ఈస్టర్ రోజున తిరిగి లేస్తాడని క్రైస్తవులు నమ్ముతారు . అందులో భాగంగా ఒకరోజు ముందుగానే యేసయ్య కోసం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని చేపట్టి యేసు లేచాడు అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ఫాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఎ. మనోహరం, కోశాధికారి రెవరెండ్ జె పి పాల్, ఉపాధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, పాస్టర్ ప్రణీత్, పాస్టర్ రాజేష్ నిర్వాహకులు కోరని అనిల్, నవీన్ కుమార్ , డింపు , నిస్సి, సన్నీ, ఇమ్మానుయేల్ , జెస్సిజేక్ , కాంత్ , గోల్కొండ సామ్ లతోపాటు వివిధ చర్చిల నుంచి వచ్చిన రడగడం పల్లి శ్రావణ్, గోల్కొండ నరెందర్, ఎం గంగాధర్ , ఎ. డానియల్, ఎ.మహేందర్ , జాన్ రవి తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న నవయువ యువజన సంఘం సభ్యులు

## పాద చారుల వంతెన, రోడ్డు దాటే సౌకర్యాలు కల్పించాలి

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం): బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ ప్రజల ప్రయాణ మార్గాలపై ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు సహకరించాలని నవ యువ యూత్ క్లబ్ ప్రతినిధులు కోరారు . ఈ మేరకు శనివారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ కు సమస్యలతో కూడిన ఓ వినతి పత్రం అందజేశారు. దుర్గా నగర్ నుండి ఆరామ్‌ఘర్ వరకు సురక్షితమైన పాదచారుల క్రాసింగ్‌ల సమస్యగా మారింది. గత కొన్ని నెలలుగా, రద్దీగా ఉండే హైవేను దాటడానికి ప్రయత్నించే వ్యక్తులు గాయపడడం లేదా ప్రమాదాలకు గురికావడం జరిగింది. నవ యువ యూత్ క్లబ్ తరపున, బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ నివాసుల తరపున ఈ విషయాన్ని పరిష్కరించడంలో మీరు తక్షణమే జోక్యం చేసుకోవాల్సిందిగా కోరుతున్నామని ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. పాదచారుల భద్రతను నిర్ధారించడానికి ఈ ప్రాంతం యొక్క క్షుణ్ణంగా అంచనా వేయాలని, సమర్థవంతమైన చర్యలను అమలు చేయాలని మేము మిమ్మల్ని కోరుతున్నామన్నారు. ఇందులో పాదచారుల క్రాసింగ్‌ల ఏర్పాటు, స్పీడ్ బంప్‌లు, ఏర్పటు చెయ్యాలని కోరుచున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ అద్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాద్యక్షులు రమేష్ రేడ్డి ఆర్జున్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఫయాజ్ అహ్మద్‌కు సన్మానం

## ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం): ప్రతి ఒక్క ఉద్యోగి అంకిత భావంతో పనిచేసినప్పుడే విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో సాగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. వెంకటరమణ అన్నారు. ఎందరో ఉద్యోగుల నిరంతర శ్రమ వల్లనే నేడు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ స్థాయిలో నిలిచిందనీ, రైతాంగానికి, వ్యవసాయ రంగానికి అసమాన సేవలు అందించగలుగుతుందని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో సూపరిండెంట్ గా పనిచేస్తున్న పి. పాపయ్య, నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ లో జూనియర్ లైబ్రరీ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఫయాజ్ అహ్మద్ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆ సందర్భంగా పరిపాలనా భవనంలో జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం వెంకట రమణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆ ఇద్దరు ఉద్యోగులు సుమారు 36 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అందించిన సేవల్ని అభినందించారు. వారిని సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం వారు కలకాలం ప్రశాంత జీవనం కొనసాగించాలని రిజిస్ట్రార్ ఎం. వెంకటరమణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. పాపయ్య, ఫయాజ్ అహ్మద్ సేవల్ని కొనియాడారు ఆత్మీయ సత్కారం చేశారు.



పి. పాపయ్యకు మెమోంటో అందచేసి సన్మానించిన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం వెంకట రమణ



ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నవయుగ యూత్ క్లబ్ ప్రతినిధులు

## బాబుల్ రెడ్డి నగర్ వద్ద పాదచారుల రోడ్డు క్రాసింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

### ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేసిన యూత్ క్లబ్ ప్రతినిధులు

రాజేంద్రనగర్, మార్చి 30(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ ల లో పాదచారుల క్రాసింగ్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని స్థానిక నవ యువ యూత్ క్లబ్ ప్రతినిధులు శనివారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ ను కలిసి వినతి పత్రం బాబుల్ రెడ్డి నగర్ వద్ద రద్దీగా ఉండే నివాస ప్రాంతం, వారి రోజువారీ అవసరాల కోసం ప్రజా రవాణా , ఇతర ప్రయాణ మార్గాలపై ఆధారపడిన నివాసితులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. దురదృష్టవశాత్తు, సరైన అవస్థాపన లేకపోవడం, ముఖ్యంగా (దుర్గా నగర్ నుండి ఆరామ్‌ఘర్ వరకు) వద్ద సురక్షితమైన పాదచారుల క్రాసింగ్‌ల పరంగా మా కమ్యూనిటీకి ఒక ముఖ్యమైన సమస్యగా మారింది. గత కొన్ని నెలలుగా, రద్దీగా ఉండే హైవేను దాటడానికి ప్రయత్నించే వ్యక్తులు గాయపడడం లేదా ప్రమాదాలకు గురికావడం, ఫలితంగా జీవితాన్ని మార్చివేసే అనేక దురదృష్టకర సంఘటనలను మేము చూశాము. పరిస్థితి కాలక్రమేణా మరింత దిగజారింది. మరింత హానిని నివారించడానికి తక్షణ చర్య అవసరమని ఇది స్పష్టంగా మారింది. కావున, నవ యువ యూత్ క్లబ్ తరపున బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ నివాసితులు, ఈ విషయాన్ని పరిష్కరించడంలో మీరు తక్షణమే జోక్యం చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము. పాదచారుల భద్రతను నిర్ధారించడానికి ఈ ప్రాంతం యొక్క క్షుణ్ణంగా అంచనా వేయాలని, సమర్థవంతమైన చర్యలను అమలు చేయాలని మేము మిమ్మల్ని కోరుతున్నాము. ఇందులో పాదచారుల క్రాసింగ్‌ల ఏర్పాటు, స్పీడ్ బంప్‌లు, ఏర్పటు చెయ్యాలని కోరుచున్నాము. మేము మీ ప్రతిస్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము . ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూర్చే పరిష్కారాన్ని కనుగొనడంలో మీరు ఈ సమస్యకు తగిన ప్రాధాన్యత ఇస్తారని మేము విశ్వసిస్తున్నము. ఈ విషయంపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ సిఐ కిరణ్ కుమార్ ని కలిసి నవ యువ యూత్ క్లబ్ తలపున వినతి పత్రం శనివారం నవయువ యూత్ క్లబ్ అద్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాద్యక్షులు రమేష్ రేడ్డి ఆర్జున్, శ్రీను కలిసి వివతీ పత్రం ఇవ్వడం జరిగిందీ.



మాధవరెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన చేత కట్ చేయిస్తున్న అభిమానులు

## ఘనంగా అన్నపూరెడ్డి మాధవ రెడ్డి 60వ జన్మదిన వేడుకలు

బండ్లగూడ, మార్చి30(ప్రభాత ఉదయం) బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ కు చెందిన రంగారెడ్డి జిల్లా రైతు సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, సంఘ సేవకుడు అన్నపూరెడ్డి మాధవ రెడ్డి 60వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం కిస్మత్పూర్ లోని ఆయన స్వగృహంలో అభిమానులు ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు మాధవరెడ్డిని కలిసి ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాధవరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ప్రసాద్ , సాకేత్ రెడ్డి, భాను ప్రసాద్,కపిల్, చిన్న, టిల్లు,అరవింద్, నాని, సాక్షి రాజేంద్ర నగర్ జోన్ ఇంచార్జి బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, మార్చి 39(ప్రభాత ఉదయం) బుద్వేల్ లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ విందులో ముస్లిం మైనారిటీ సోదరులతో పాటు బి ఆర్ ఎస్ నాయకులు కోరని రవీందర్, శ్రావణ్, చెన్నయ్య, మజ్జిగ నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





కాటేదాన్ లో ఇటీవల తగులబడిన పహల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బిస్కట్ కంపెనీ ని పరిశీలిస్తున్న సీపీఐ, ఏ ఐ టీయూసీ నాయకులు

## పహల్ బిస్కట్ కంపెనీ అగ్ని ప్రమాదం పై విచారణ జరిపించాలి : సీపీఐ డిమాండ్

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పహల్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ లో అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాలు నర్సింగ్ రావు, ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ మండల కార్యదర్శి ఎం. ఏ. రియాజ్ ఆధ్వర్యంలో సి పి ఐ, ఏ ఐ టియూసి లతో కూడిన బృందం దగ్ధమైన బిస్కెట్ కంపెనీని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పుస్తకాల నర్సింగ్ రావు, ఓరుగంటి యాదయ్య లు మాట్లాడుతూ 1998లో ఏర్పాటు చేయబడిన పహాలు బిస్కెట్ కంపెనీ చాక్లెట్లను, కేక్లను తయారు చేయడంతో పాటు పిల్లలు తినే అనేక రకాల తిను పదార్థాలను తయారు చేస్తుందని అన్నారు. పహాల్ కంపెనీలో వందలాది కార్మికులు పనిచేస్తున్న అగ్నిమాపక నివారణ చర్యలు తీసుకోవడంలో కంపెనీ యాజమాన్యం పూర్తిగా విఫలమైందని అన్నారు.. కార్మికుల ప్రాణాలు పనంగా పెట్టి కంపెనీ యాజమాన్యం వస్తు ఉత్పత్తి చేస్తుంది అన్నారు. ఒక విధంగా చెప్పాలంటే కంపెనీ నిర్మాణమే చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పడిందని అన్నారు.. పహాల్ పరిశ్రమలో తనిఖీలు చేయకుండా వివిధ డిపార్ట్మెంట్ అధికారులను కంపెనీ యాజమాన్యం లోపరుచుకున్నట్టుగా మా పరిశీలనకు వచ్చిందని అన్నారు. కంపెనీ యాజమాన్యం యొక్క తప్పిదాలను కప్పిపుచ్చి ఇన్సూరెన్స్ క్లైమ్ చేయడం కోసం యాజమాన్యం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని అన్నారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఏర్పడిన అగ్ని ప్రమాదం వలన అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవలసి వచ్చేదని అన్నారు. చుట్టుపక్కల పరిశ్రమలు కూడా అగ్ని ప్రమాదానికి గురి కావలసి వచ్చేది అన్నారు. బుధవారం రాత్రి, గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం, అధిక లాభర్జన, తప్పుడు దొరనులు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు.. ఈ కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అప్సర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మల్లేష్, స్వామి, సత్తయ్యలు పాల్గొన్నారు.

## ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అవకాడో తోటల పెంపకంపై అవగాహన సదస్సు

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఐజి డెక్కన్ ఎక్సోటిక్స్ సహకారంతో రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో శనివారం శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడో తోటల పెంపకం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సు ను ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ బి.నీరజా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ... అవకాడో మొక్కల పెంపకం ప్రాముఖ్యత, సమృద్ధిగా ఉన్న ఔషధ గుణాలను వివరించారు. భవిష్యత్తులో మన రాష్ట్రంలో అవకాడో తోటల పెంపకం దృష్టిలో ఉంచుకొని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం లో పరిశోధనలను ప్రారంభించామని తెలిపారు. ఆదిలాబాద్, అశ్వరావుపేట పరిశోధన కేంద్రాల్లో కూడా నూతన శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడో పై పరిశోధన జరిపి వాటి ఫలాలను రాష్ట్రంలో అవకాడో మొక్కల పెంపకంపై క్షేత్రస్థాయిలో ఆచరించవలసిన పరిజ్ఞానాన్ని రైతులకు అందించుటకు విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వివరించారు. ప్రపంచ స్థాయిలో గర్వించదగ్గ విధంగా మన రాష్ట్రం రైతులు అవకాడో తోటల పెంపకం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ వి. ప్రవీణ్ రావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో అవకాడో తోటల పెంపకం పై అవగాహన కలిగి ఉండాలని, అదేవిధంగా సరైన నేలను ఎంచుకొని వాటి గురించి తెలుసుకోవడం కోసం నేషనల్ బ్యూరో ఆఫ్ సైన్స్ సహకారంతో తోటలను పెంచే నేలల సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు.ముఖ్యంగా డాక్టర్ శ్రీనివాసరావు నిర్వహిస్తున్న అవకాడో క్షేత్రాన్ని రైతులు సందర్శించాలని పేర్కొన్నారు.అదేవిధంగా అవకాడో సాగు లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ఆవశ్యకతపై మరికొన్ని అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.



సదస్సు ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్

అవకాడో పండ్లలో ఉన్న పోషణ ప్రొఫైల్స్ వాటి డిమాండ్ రీత్య విరివిగా తోటలను పెంచాలని తెలిపారు.ప్రధానంగా సరైన అధిక దిగుబడిని పొందటానికి నాణ్యమైన మొక్కలను ఎంచుకొని వాటిని పెంచడంలో క్షేత్రస్థాయిలో అవలంబించాల్సిన పద్ధతులను శాస్త్రవేత్తలు అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అందించాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీడి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్, హస్కల్బర్గ్ నర్సరీస్, ఇజ్రాయిల్, మాట్లాడుతూహస్కల్బర్గ్ నర్సరీస్, ఇజ్రాయిల్ లో నిర్వహిస్తున్న అవకాడో నర్సరీల ప్రాముఖ్యత వాటి పరిణామక్రమాల గురించి వివరించారు.ప్రపంచ స్థాయిలో అవకాడో పండ్లకున్న ప్రాముఖ్యత వాటి డిమాండ్ గురించి తెలిపారు. ప్రధానంగా భారత దేశంలో అవకాడో తోటల పెంపకం ఆవశ్యకత వాటి పరిస్థితుల గురించి కూలంకుషంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఏ. కిరణ్ కుమార్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ రాజశేఖర్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి ప్రశాంత్, డాక్టర్ కరుణాకర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఐ ఐ హెచ్ ఆర్, బెంగళూర్ , అమిత్ శర్మ, వైస్ ప్రెసిడెంట్, స్ట్రాటజీ అండ్ ఫామ్, ఐజి ఇంటర్నేషనల్, ఉది హస్కల్బర్గ్ సీఈవో , అస్కల్బర్గ్ నర్సరీ, ఇజ్రాయిల్, శ్రీనివాసరావు, డాక్టర్ సురేష్ కుమార్ , డాక్టర్ సాయి కృష్ణ నిఖిల్, రైతులు, బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు..

# చేవెళ్లలో టీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలి

## మాజీ మంత్రి సబితా రెడ్డి



శేరిలింగంపల్లి,మార్చి30(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ బి ఆర్ ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని మాజీ మంత్రి సబితా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల సన్నాహక ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , ఎమ్మెల్సీ దయానంద్ లతో కలిసి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. కేసీఆర్ నేతృత్వంలో గత ప్రభుత్వం సంక్షేమానికి స్వర్ణయుగంగా ఉన్నదని,శేరిలింగంపల్లిలో తిరుగుతుంటే మనం విదేశాల్లో ఉన్న విధంగా మారిందన్నారు.హామీల అమలులో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, అన్ని వర్గాలకు ఆప్తుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కి ఎనలేని కృషి చేసిన నాయకులు, బీసీ గొంతుక కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ని బీఆర్ఎస్ పార్టీ తరపున ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సమావేశంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి గారు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కష్టకాలంలో పార్టీని విడిచి కార్యకర్తలను మోసం చేసిన ఎంపీలు రంజిత్ రెడ్డిని ఓడించి బీఆర్ఎస్ పార్టీ కేడర్ సత్తా ఏమిటో చూపించాలని పిలుపునిచ్చారు. హామీలు నెరవేర్చి మంచి పాలన చేయడం చేతకాక కాంగ్రెస్ నేతలు కేసీఆర్ కుటుంబాన్ని బద్నాం చేసి ఇబ్బందులకు గురిచేసి బీఆర్ఎస్ పార్టీ కేడర్ లో గందరగోళం రేపి పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందాలని కుట్రలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఎత్తులను చిత్తు చేసేలా పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు కదిలి కాంగ్రెస్ మోసపు 6 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ కు ఓట్లు వేయించాలని, ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గారికి గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే మెజార్టీ ఓట్లు వచ్చేలా కృషి చేయాలని సబితా ఇంద్రారెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపి ప్రజలకు సంక్షేమ, సుభిక్ష పాలనను అందించారని పేర్కొన్నారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ఎన్నో మంచి పనులు అమలు జరిగితే కేవలం 3 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు, రైతాంగానికి కష్ట, నష్టాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలననే మరలా ప్రజలు కోరుకుంటున్నారని.. 6 గ్యారెంటీలు ఇచ్చి చేతులు ఎత్తేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో ఓటుతో కళ్ళు తెరిపించాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థుల్లో తాను 40 ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నానని.. జెడ్పి ఛైర్మన్ గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశానన్నారు. 96 బీసీ కులాలను ఒక్కతాటిపైకి తెచ్చి, బిసిలకు, రాజ్యాధికారం, సాధికారత దక్కాలని అలుపెరుగని పోరాటం చేస్తున్న తనను బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు అందరూ కష్టపడి పనిచేసి ఆశీర్వదించి పార్లమెంటుకు ఎన్నుకొని నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని ఇవ్వాలని కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ మాట్లాడుతూ... ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీకి నష్టం లేదని,పార్టీ మారిన కార్పొరేటర్ డివిజన్ బాధ్యతలు తాను తీసుకొని అత్యధిక మెజార్టీ తీసుకువస్తామన్నారు.కేసీఆర్ చేవెళ్ల అభ్యర్థిగా ప్రకటించిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకు కృషి చేస్తామన్నారు.ఈ సమావేశంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్ ,మంజుల రఘునాథరెడ్డి ,ఉప్పలపాటి శ్రీకాంత్ ,హమీద్ పటేల్ ,నార్నె శ్రీనివాస్ రావు ,రోజా దేవి రంగారావు ,మాజీ కార్పొరేటర్ సాయి బాబా ,సీనియర్ నాయకులు మువ్వ సత్యనారాయణ , డివిజన్ అధ్యక్షులు, ఇతర నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ప్రతి ఒక్కరు ఓటు వేయాలి : రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి



5కె రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి



5కె రన్ లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం) : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల ను దృష్టిలో ఉంచుకుని ఎలక్షన్ కమిషన్ అదేశాలమేరకు ఓటు శాతం పెంచుటకు స్వీప్ యాక్టివిటీ లో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించుటకు రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి శనివారం ఉదయం డైరీ ఫామ్ సిగ్నల్ నుండి రాజేంద్రనగర్ వరకు 5 కిలోమీటర్ల రన్నింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో స్వీప్ యాక్టివిటీ నోడల్ ఆఫీసర్ బి. శరత్ చంద్ర, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, మెప్మా ఏవో జ్ఞానేశ్వర్ , డీఆర్డీఏ పీడీ శ్రీలత సూర్యారావు, మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, వెటర్నరీ కాలేజ్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, రెవెన్యూ, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా జీవితంలో పత్రికల ప్రాముఖ్యత ఎంతో ఉంది

## ఆంధ్రజ్యోతి సంపాదకులు కే శ్రీనివాస్

### స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడు కృష్ణారెడ్డి నీ సన్మానిస్తున్న సభ్యులు..



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సలహాదారులు రంగ సాయి

హైదరాబాద్, మార్చి 30(ప్రభాత ఉదయం): స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శనివారం ఎన్నికయింది. హైదరాబాదులోని తెలంగాణ టూరిజం ప్లాజా భవన్లో స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా మాజీ చీఫ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్, ఆంధ్రపదేశ్ మాజీ ముఖ్య ప్రధానకార్యదర్శి ఎల్ వి. సుబ్రమణ్యం ఆంధ్రజ్యోతి సంపదకులు సంపాదకులు కే. శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటు హక్కు ప్రాముఖ్యతలో చిన్న పత్రికల ప్రాముఖ్యత భాధ్యతను వివరించారు. అలాగే సమాజం ప్రజాజీవితంలో పత్రికల ప్రాముఖ్యత జర్నలిస్టుల బాధ్యతను వక్తలు వివరించారు అలాగే ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ అడ్వైజరీ బోర్డు స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్ కె.స్ రంగ సాయి అసోసియేషన్ విధివిధానాలను తెలియజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోన్నారు. ఈ కార్యవర్గంలో అధ్యక్షులుగా జి.కృష్ణా రెడ్డి, ఉపాధ్యక్షులుగా గాండ్ల శ్రీనివాస్, సురేష్ బాబు, ఇక్బాల్ హన్నాని, జగ్దీష్ రెడ్డి లు ప్రధాన కార్యదర్శిగా టి. కృష్ణా, కోశాధికారి టి సుబ్బారావు, సాయి గణేష్ సహాయ కార్యదర్శిగా కే.లక్ష్మీనారాయణ, రమేష్ బాబు, కె. నాగసాయి వీరితో పాటు మరో తొమ్మిది మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో ప్రజా క్రాంతి దినపత్రిక సంపాదకులు గాండ్ల శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ప్రజాక్రాంతి, నేటి మనదేశమ్, స్కైలాన్ దినపత్రిక పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్ ఇన్స్పెక్టర్



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఎస్ ఐ సైదులు

హైదరాబాద్, మార్చి 30(ప్రభాత ఉదయం) లంచం కోసం తిప్పలు పెడుతున్న సబ్ ఇన్స్పెక్టర్ పై ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసాడు. ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు దారుడి దగ్గర లంచం తీసుకున్న సబ్ ఇన్స్పెక్టర్ ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే .బొడ్డుపల్లి సైదులు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఓ కేసులో నిందితుడైన మధాని సుభాష్ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండటానికి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా శనివారం పట్టుకున్నారు. సబ్ ఇన్స్పెక్టర్ ని అరెస్ట్ చేసి స్పెషల్, ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి, హైదరాబాద్ నాంపల్లి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. కొసమెరుపు ఏమిటంటే రెండు సంవత్సరాల క్రితం ఈ సబ్ ఇన్స్పెక్టర్ సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో భూమి విషయంలో లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెండ్ అయ్యారు.

# టిఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ గెలుపుకు కృషి చేయాలి

## మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి



శంషాబాద్, మార్చ్ 30(ప్రభాత ఉదయం): పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రంగంలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని శంషాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్ర రెడ్డి కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బలపరిచిన బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా కాసాని జ్ఞానేశ్వర్ రంగంలో దిగుతున్నారని 103 కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఆయన కాసాని జ్ఞానేశ్వర్ ను ఎస్సీ ఎస్టీ బీసీ. మైనార్టీ. బలహీన వర్గాల ప్రజలందరూ ఏకమై గెలిపించాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ గా ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసిన కాసాని జ్ఞానేశ్వర్ ప్రజలందరికీ సుపరిచితుడేనని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న టిఆర్ఎస్ పార్టీని ప్రజలు చేవెళ్లలో మరోసారి ఆదరించాలని కోరారు. గత రెండు ఎన్నికల్లోను పార్లమెంట్ అభ్యర్థులుగా బిజెపి బలపరిచిన వారి విజయం సాధించారని జ్ఞానేశ్వర్ ను గెలిపించి హ్యాట్రిక్ రికార్డు సృష్టించాలని చంద్రారెడ్డి కోరారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకతాటిపైకి వచ్చి జ్ఞానేశ్వర్ అన్న ను గెలిపించాలని కోరారు.

# వృద్ధురాలు మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు చోరి



నర్సమ్మ

బుద్వేల్, మార్చి30(ప్రభాత ఉదయం) : వృద్ధురాలు మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని మహిళ శనివారం ఉదయం లాక్కొని పారిపోయింది. ఆ వృద్ధురాలు తేరుకునే లోపు అక్కడ ఎవరు కనిపించలేదు. దీంతో ఆమె లబోదిబో మనడంతో పక్కింటి వారు బంధువులు వచ్చి ఆరా తీశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉప్పర్ పల్లి లో నర్సమ్మ (80) అనే వృద్ధురా లో ఒక్కరే తన ఇంట్లో నివాసం ఉంటుంది. పక్కనే వారి బంధువులు ఉంటారు. ప్రతిరోజు నరసమ్మ ఉదయాన్నే లేచి వాకిలి శుభ్రం చేసి ముగ్గు పెట్టే అలవాటు ఉంది . శనివారం ఉదయం ఐదున్నర గంటలకు వాకిలి శుభ్రం చేసి మగ్గుపెట్టిన నరసమ్మ ఇంట్లోకి వెళ్లింది . ఆ సమయంలో వెనుకాలనుంచి వచ్చిన గుర్తు తెలియని మహిళ ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసులు లాక్కొని పారిపోయింది . నరసమ్మ అరుపులకు చుట్టుపక్కల వారు బంధువులు వచ్చి చూసే లోపే అక్కడ ఎవరూ కనిపించలేదు . దీంతో నరసమ్మ కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు . కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# సీఎంను కలిసిన పెద్ద గోల్కొండ మాజీ సర్పంచ్ కాముని భాయ్ సునీత లక్ష్మయ్య

శంషాబాద్, మార్చ్ 30,(ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని పెద్ద గోల్కొండ మాజీ సర్పంచులు కాముని భాయి సునీత. కాముని భాయి లక్ష్మయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డిని కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంగంలో ఉంటున్న డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి విజయానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి సూచించారు. రంజిత్ రెడ్డి విజయానికి చిత్తశుద్ధితో కృషి చేయడంతో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు అందరిని ఏకతాటి పైకి తీసుకువచ్చి 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.



# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్‌పల్లి,మార్చి30 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపా దాస్ మున్షి చేతులమీదుగా జిఎచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో పాటు ఆల్విన్ కాలనీ (124)డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిసి కండువా కప్పుకున్నారు.**



# ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

**గద్వాల,మార్చి30(ప్రభాత ఉదయం)పదోతరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు 7,203మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 7,171 హాజరయ్యారు. 32మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 41 పరీక్షా కేంద్రాలను 10ఫ్లయింగ్ స్క్వాడ్స్, 3 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్న అధికారులు, సిబ్బందిని విద్యాశాఖ జిల్లా అధికారి, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అభినందించారు.**



# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల

**కూకట్‌పల్లి,మార్చి30 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపా దాస్ మున్షి చేతులమీదుగా జిఎచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో పాటు ఆల్విన్ కాలనీ (124)డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిసి కండువా కప్పుకున్నారు.**

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.